ప్రజాశక్తి
ఆదివారం 20 జులై 2025
5
అల్లూరి సీతారామరాజు

అరకులోయలో భారీ వర్షం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అరకులోయ మండలంలోని పరిసర ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం ఏకధాటిగా కుండపోత వర్షం కురిసింది. నాలుగు రోజులుగా ఉదయం సమయంలో ఎండ మధ్యాహ్నం వాన కురుస్తోంది. దీంతో కొంత వరకు ప్రజలకు ఉపశమనం లభించింది.కుండ పోత వర్షం కారణంగా వాగులు, వంకలు, చెరువులు, పంట పొలాలు నిండిపోయి పొంగి పొర్లుతున్నాయి. పలు గ్రామాల్లో డ్రైనేజీలు లేక వరద నీరు రోడ్లపైనే పారుతుంది. దీంతో మండల కేంద్రానికి వివిధ పనులు నిమిత్తం వచ్చిన గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కురుస్తున్న వర్షం

హైడ్రో పవర్ ప్రాజెక్టులను వ్యతిరేకించాలి

-ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి- అనంతగిరి:హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. గుమ్మకోట పంచాయతీ పరిధి గుజ్జెల్లి గ్రామంలో సందర్శించి గిరిజనులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం అక్కడ నుండి బురద గెడ్డ గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభను ఉద్దేశించి సురేంద్ర మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టులను వ్యతిరేకించాలన్నారు. ఆదివాసుల హక్కులు, చట్టాలకు తీవ్ర నష్టం కల్గిస్తూ పెదకోట, చిట్టెంపాడు, గుజ్జెలిలో అదానీ ఎనర్జీ నవయుగ ప్రైవేట్ కంపెనీల హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంపై సర్వే నిలిపి వెయ్యాలని డిమాండ్ చేశారు. అనంతగిరి మండలంలో గుమ్మకోట పంచాయతీ గుజ్జెలి ప్రాంతాల్లో నిర్మిస్తున్న హైడ్రోపవర్ ప్రాజెక్ట్‌తో 16 గ్రామాలలో సుమారు 3వేల మంది ఆదివాసులకు ముప్పు ఏర్పడుతుందన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు పెదకోట గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంతో గిరిజనులు తీవ్ర నష్టానికి గురవుతారని, వ్యవసాయ భూములు కోల్పోవడమే కాకుండా సంవత్సరానికి ఆదాయం ఇచ్చే జీడి మామిడి చింతా, పనస వంటి తోటలు పూర్తిగా నాశనమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. తాగునీరు కలుషితం అవుతుందన్నారు.

జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, గిరిజనులకు నష్టాన్ని గురిచేసే ఆదానీ అంబానీ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని చీకటి జీవోలను తెచ్చి గిరిజనులకు భయభ్రాంతులకు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని తెలిపారు. ప్రభుత్వం వెనక్కు తగ్గి అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం అనంతగిరి మండల ఉపాధ్యక్షులు జె.వెంకటరమణ, పంచాయతీ నాయకులు ఆర్ శ్రీను, గ్రామనికి చెందిన మహేష్, రాంబాబు పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న సురేంద్ర, గంగరాజు, గిరిజనులు

పునరావాస కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి - వి.ఆర్ పురం: పునరావాస ముంపు గ్రామాల పేరుతో కాలనీలకు వెళ్లిన నిర్వాసితులకు ప్రభుత్వం సరైన మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల సిపిఎం కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ అన్నారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కాపవరం, కన్నాయిగూడెం, రామ్‌గోపాలపురం పునరావాస కాలనీల్లో బాధితులను కలిసి వారి సమస్యలను విన్నారు. మండల పరిధిలోని దాదాపు 19 గ్రామాలు పోలవరం మొదటి కాంటూరులో ముంపునకు గురవుతున్నాయి. కొల్లూరు గొందూరు, కొటారుగొమ్ము ,శ్రీరామగిరి గ్రామాల నిర్వాసితులకు నెల్లిపాక దగ్గరలో రామ్‌గోపాల్‌పురంలో, తుష్టివారిగూడెం వారికి కాపవరంలో, ములకపల్లి, కల్తునూరు, ఇప్పూరు, గ్రామాల వారికి కన్నాయిగూడెంలో, ఇసునూరు, రాయిగూడెం వారికి విస్సాపురం, జీడిగుప్ప వారికి కూనవరం మండలం భైరవపట్నంలో పునరావాస కాలనీలు ఎనిమిది సంవత్సరాల క్రితం నిర్మించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కాలనీలో ఉంటున్నవారు సిపిఎం నాయకులతో మాట్లాడుతూ కాలనీల్లోని వీధుల్లో రోడ్లు నిర్మించలేదని, అంగన్‌వాడి, పాఠశాల భవనాలు నిర్మాణం పూర్తికాక కాలనీల్లో ఉంటున్న పిల్లలంతా వేరే గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందన్నారు. గ్రామాల్లో నిర్వాసితులందరికీ భూమికి భూమి చూపించారు కానీ అక్కడ వ్యవసాయం చేయడానికి వీలు లేకుండా జామాయిల్ మొక్కలతో దర్శనమిస్తున్నాయని ప్రతినెలా పింఛన్ కోసం, రేషన్ బియ్యం కోసం తమ సొంత గ్రామాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. నిర్వాసిత కాలనీల విషయంపై త్వరలోనే జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒను కలసి తమ సమస్యలను వివరిస్తామన్నారు. కాలనీల పర్యటన బృందంలో మండల ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ వెట్టి లక్ష్మి, మండల కమిటి సభ్యులు పోడియం శ్రీరామమూర్తి, పంకు సత్తిబాబు, గుండుపూడి లక్ష్మణరావు, కారం సుందరయ్య, శిరపు తాతబాబు, కుంజా కన్నయ్య, ఆత్మకూరి కాంతారావు, సిహెచ్ సుబ్బారావు మరియు నిర్వాసిత కాలనీల పెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలోని బురదరోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

కనీస వేతనం ఇవ్వాలని వినతి

జెన్‌కో ఇఇ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు ఎపి జెన్‌కోలో వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లకు కనీసవేతనం ఇపిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎపి జెన్‌కో ఇఇ రాజేంద్రప్రసాద్‌కు శనివారం యునైటెడ్ ఎలక్ట్రికల్ సిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ హెచ్176 సిఐటి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశామని మోతుగూడెం సిఐటి బ్రాంచ్ నాయకులు చింతా రాంబాబు గౌరవ అధ్యక్షులు సుభాన్, బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, విష్ణుకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దీర్ఘకాలంగా పనిచేస్తున్న డ్రైవర్లకు సంబంధిత కాంట్రాక్టర్ కనీస వేతనం ఇపిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పెయిడ్ హాలిడేస్, ఎరాలీవ్ విడిఎ పాయింట్స్ డ్రైవర్స్‌కి ఇవ్వాల్సి ఉండగా కాంట్రాక్టర్లు ఇవ్వడం లేదన్నారు. వీటన్నిటిపై ఎపి జెన్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు కోఆర్డినేటర్ ఎం రమణభాస్కరరావు, ఎస్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - చింతూరు : అల్లూరిసీతారామరాజు జిల్లా, తుమ్మల పంచాయితీ, చింతూరు మండలం, రింగల గ్రామంలోని త్రాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో ట్యాంక్ నిర్మాణం జరిగి 4 సంవత్సరాలు అవుతోంది కానీ అది నిరుపయోగంగా ఉంది అన్నారు. శనివారం ట్యాంకు వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. సమస్య పరిష్కారం కోసం పంచాయతీ అధికారులకి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదన్నారు. ఎంపిటిసి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి స్పందించకపోతే భవిష్యత్తులో ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వేక లెనిన్, సోడి సాయికుమార్, గ్రామస్థులు పులి చందు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు..

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి -అనంతగిరి:అరుకు -కేకే లైన్లో పనిచేస్తున్న ట్రాక్ మెన్ కాంట్రాక్ట్ కార్మికులకు, స్టేషన్లో పనిచేస్తున్న శానిటేషన్ ఇతర ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం 26 వేలు చెల్లించాలని ఏపీ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి. నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అనంతగిరి. సిఐటియూ కార్యాలయంలో యూనియన్ జిల్లా కార్యదర్శి. సన్యాసిరావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు రైల్వే బోర్డు ఇచ్చిన జీవో ప్రకారం కాంట్రాక్టర్లు వేతనాలు చెల్లించడం లేదని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులు పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారని తెలిపారు. తక్షణం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ తక్షణం రద్దు చేయాలన్నారు. కేకే లైన్లో పని చేస్తున్న ట్రాక్ మైంటెన్స్ కార్మికులకు సేఫ్టీ మెటీరియల్స్ ఇవ్వాలన్నారు. రైల్వే స్టేషన్ లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు, రైల్వే రన్నింగ్ రూమ్ లో పని చేస్తున్న కార్మికులకు స్కిల్ లేబర్ కింద గుర్తించి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కార్మికులు ఐక్యంగా పోరాడాలని, అందుకు యూనియన్‌ను బలోపేతం చేయాలని తెలిపారు. పోరాడితేనే సమస్యలు పరిష్కారం సాధ్యమన్నారు. వేతనాలు పెరగక పోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులతో, అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు దామోదర్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కిలో.మొస్య, రైల్వే యూనియన్ నాయకులు పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సన్యాసిరావు

సర్వసభ్య సమావేశంలో సమస్యల వెల్లువ

- పరిష్కరించాలని గళ మెత్తిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సమస్యలు వెల్లువెత్తాయి. మండలంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన రహదారులను తక్షణం పూర్తి చేయాలని కొండపల్లి, చికిలింత సర్పంచ్ లు కుంజం జగన్నాథం, కొండ్ల సూరిబాబు డిమాండ్ చేశారు. రాజవొమ్మంగి పిహెచ్‌సిని సిహెచ్‌సిగా మార్చాలని, పిహెచ్‌సిలో పూర్తి స్థాయిలో మందులు, వైద్యసిబ్బందిని ఏర్పాటు చేయాలని, బ్రెయిన్ ట్యూమర్‌కు ఉపయోగపడే ఇంజక్షన్ అందుబాటులో ఉంచాలని రాజ ఒమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి, లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజులు అధికారులను కోరారు. బోర్లు మరమ్మతులకు పంచాయతీలకు నిధులు కేటాయించాలని, సర్పంచులకు నిధులు ఇవ్వాలని అధికారులను కోరారు. నాడు నేడు పనులు పూర్తి చేయాలని మాడేరుబాక సర్పంచ్ ఆదినారాయణ అన్నారు. ఉపాధి పనుల్లో అవినీతిని అరికట్టాలని, రెండు రోజులు పనికొచ్చిన వారికి వారం పొడుగునా మస్టర్లు వేస్తున్నారని, దీనివలన నిజమైన వేతన దారులు ఇబ్బందులు గురవుతున్నారని జడ్పిటిసి వడుగుల జ్యోతి ఆరోపించారు. ఏకోపాధ్య పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించేలా విద్యాశాఖ అధికారులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, తహశీల్దార్ సత్యనారాయణ, వైస్ ఎంపిపిలు చప్పా సత్య చంద్రరాణి, జుర్రా రాజేశ్వరి, ఎంపిటిసి కనిగిరి గంగాదుర్గా, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, కో ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, పలు పంచాయతీలకు చెందిన సర్పంచ్ లు, ఎంపిటిసిలు పలు శాఖాధికారులు పాల్గొన్నారు.

అధికారులకు సమస్యలు వివరిస్తున్న ప్రజాప్రతినిధులు

విద్యుత్ కోతలపై గిరిజనుల నిరసన

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్

ప్రజాశక్తి- అరకు లోయ:అరకు లోయకు ఆనుకొని ఉన్న శరభగుడ హౌసింగ్ కాలనిలో ప్రతి రోజు ఉదయం నుండి మధ్యానం వరకు అప్రకటిత విద్యుత్ కోతతో పాటు ఓల్టేజీ తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. తక్షణమే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శరభగుడ హౌసింగ్ కాలనీ ట్రాన్స్ ఫారం వద్ద గ్రామస్థులతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్రీ ఫేస్ మంజూరై ఏడాది గడిచిన పనులు విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటికి పనులు చేయలేదని ఆయన అన్నారు. శరభగుడ హౌసింగ్ కోలానిలో తక్షణమే విద్యుత్ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అరకులోయ మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఉన్న శరభగుడ హౌసింగ్ కాలనీలో గత పది రోజుల నుండి అప్రకటిత విద్యుత్ కోత ఏర్పడుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు గురవుతున్నారని ఆయన అన్నారు. శరభగుడ హౌసింగ్ కాలనీ అరకువేలి మండలకేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని సంభదిత అధికారులకు అనేక మార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం చేయలేదన్నారు. రెండు సంవత్సరాల నుంచి లోవోల్టేజీ సమస్య ఉందని విద్యుత్ తీగలు కాలిపోతుందని ట్రాన్స్ ఫార్మర్ లోడు ఎక్కవ గా ఉండడం వల్ల సమస్య తీవ్రత పెరిగిందని గతంలో అనేకమార్లు ఆందోళన చేయడంతో త్రీ బెస్ట్ మంజులైందని, త్రీ ఫేస్ మంజూరై ఏడాది గడుస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు ఇంతవరకు కనీసం పని ప్రారంభించలేదన్నారు.ఈ కార్యక్రమంలో శరభగుడ హౌసింగ్ కాలనీ గ్రామస్థులు డి.రమణ, కె. అప్పన్న, జి. బుజ్జీ, ఎల్.బి. భాగ్య, ఎస్.తార, కె.ఆశిష్, కె.అవినాస్, కె.సాయి, కె.దేబోరా, నవనీత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి - విఆర్ పురం: వారం రోజుల క్రితం తులసిపాక ఘాట్‌రోడ్ లో బైక్ ప్రమాదానికి గురై కాలు విరిగిన వైసిపి కార్యకర్త కారం సీతరామయ్య కుమారుడు కారం సింగరాజును వైసిపి మండల నాయకులు శనివారం పరామర్శించారు. రామవరం పంచాయతీ పరిధిలోని సింగరాజు గ్రామం కోప్పల్లి వెళ్లి పరామర్శించారు. చినమ్మట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, ఆర్టిఐ విభాగం అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ మండల నాయకులు చింతరేవుపల్లి పిసా అధ్యక్షులు కోటం జయరాజు, ఎస్సీ సెల్ నాయకులు మాచర్ల వెంగళరావు తదితరులు ఉన్నారు.

21న ఐటిడిఎ ముట్టడి విజయవంతం చేయండి

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏరియా హాస్పిటల్ నందు కాకూరి పార్వతి అనే ఆదివాసీ మహిళ డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిందని ఈ విషయమై ఈ నెల 21న రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయాలని 'ఆదివాసీ సంఘాల కూటమి' నాయకులు 'ఆదివాసీ చైతన్య వేదిక' అధ్యక్షులు వెదుళ్ల లచ్చిరెడ్డి 'ఆదివాసీ సంక్షేమ పరిషత్' (274/16) జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు పిలుపునిచ్చారు. సోమవారం రంపచోడవరం ఐటిడిఎ ఎదుట రంపచోడవరం ఏరియా హాస్పిటల్ డాక్టర్ల నిర్లక్ష్య వైఖరిపై నిరసన తెలపనున్నట్టు వారు పేర్కొన్నారు. కాకూరి పార్వతి మృతికి కారణమైన రంపచోడవరం ఏరియా హాస్పిటల్ డాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నామన్నారు.

గుర్రంపేటలో మంచినీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలో గుర్రంపేటలో ప్రజలు తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న స్థానిక సర్పంచ్ వెట్టిలక్ష్మి తక్షణమే స్పందించి తమ నిధులతో మోటారు, పైప్‌లైన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. శనివారం సర్పంచ్ వెట్టి లక్ష్మి, ఎంపిపి కారం లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, నాయకులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, పొడియం శ్రీరామమూర్తి, గుండిపూడి లక్ష్మణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పథకం ప్రారంభిస్తున్న దృశ్యం

ఆర్‌వి.నగర్-పాలగెడ్డ రహదారి బాగుచేయరా..?

- సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు విష్ణుమూర్తి

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు అంతర్రాష్ట్ర ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉందని గర్భిణులు చికిత్స నిమిత్తం మైదాన ప్రాంతానికి వెళ్లేటప్పుడు ఎటువంటి సంఘటనలు చోటు చేసుకున్నా దానికి పూర్తి బాధ్యత జిల్లా కలెక్టరు దినేష్ కుమార్, ఐటిడిఎ పిఒ, ఆర్‌అండ్‌బి అధికారులు వహించాల్సి ఉంటుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్ 8న భారీవర్షాలకు రహదారి అధ్వానంగా తయారైందని, ప్రభుత్వం నిధులు మంజూరైనా నిర్మాణానికి నోచుకోలేదన్నారు. రహదారి నిర్మించాలని ప్రజాప్రతినిధులు, నాయకులు ధర్నాలు రాస్తారోకోలు చేసినా చర్యలు చేపట్టడం లేదన్నారు. జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీకి వెళ్లే రహదారిలో మాదిగమల్లు వద్ద వంతెన కొట్టుకుపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. రహదారి నిర్మాణానికి సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుంకర విష్ణుమూర్తి

57 మంది సిబ్బంది బదిలీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న 57 మంది సిబ్బందికి ఇతర ప్రాంతాలకు బదిలీ అయినట్లు ఎంపిడిఓ లోకుల యాదగిరిశ్వరరావు శనివారం తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ. ప్రధానంగా సచివాలయాలు నుండి డిజిటల్ అసిస్టెంట్ 12 మంది, వెటర్నరీ 10, వ్యవసాయశాఖ 10, ఇంజినీరింగ్ అసిస్టెంట్ 9, పంచాయితీ కార్యదర్శులు 5, సర్వేయర్ ఒకరు వేరువేరు మండలాలకు బదిలీపై వెళ్లినట్లు తెలిపారు. వారి స్థానంలో వేరే మండలాల నుండి ఇక్కడికి కొంతమంది ఇప్పటికే ఉద్యోగాల్లో చేరగా, మరి కొంతమంది చేరాల్సి ఉందన్నారు.

నూతన తహాశీల్దార్లకు అభినందనలు

జి.మాడుగుల తహాశీల్దార్‌ను సత్కరిస్తున్న సంఘం నేతలు

ప్రజాశక్తి -జిమాడుగుల:తహసీల్దార్ జి.రాజ్ కుమార్ కు శనివారం అల్లూరి జిల్లా గిరిజన ఐక్యవేదిక నాయకులు అభినందనలు తెలిపి చిరు సత్కారం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో యువ తహసిల్దార్ బాధ్యతలు చేపట్టడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన వేదిక జిల్లా అధ్యక్షులు సుర్ల లోవరాజు, జిల్లా సహాయ కార్యదర్శి కొండపల్లి మత్స్య రాజు, నాయకులు కొంతలంగి వెంకటరమణ, సెగ్గే పోతురాజు కె.సాయి, కళ్యాణం తదితరులు పాల్గొన్నారు.

జీకే వీధి: మండలంలో నూతనంగా తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన హెచ్ అన్నజి రావు కు జీకే వీధి టిడిపి మండల అధ్యక్షులు పోత్తూరు కొండలరావు ఆధ్వర్యంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పోత్తూరు కొండలరావు, ముక్కలి రమేష్, కోటేశ్వరరావు, బాలయ్య,నూకరాజు పాల్గొన్నారు.

చింతపల్లి:మండల రెవెన్యూ శాఖలో ఎదురవుతున్న సమస్యలు వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత తహశీల్దార్‌ను కోరారు. చింతపల్లి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వారు పుష్పగుచ్ఛాలు అందించారు.

చింతపల్లి తహాశీల్దార్‌ను సత్కరిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి సాధనకు

21,22 తేదీల్లో 48 గంటల ధర్నా

ప్రజాశక్తి-పాడేరు :- ఆదివాసీ నిరుద్యోగుల సంఘం, ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21, 22 , తేదీల్లో ఐటీడీఏ ముందు 48 గంటల ధర్నా కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసి యువత, నిరుద్యోగులు విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘాల నాయకులు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ నుండి ఆదివాసి పోస్టులు మినహాయించి, ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, 100శాతం ఉద్యోగ నియ చట్టం చేయాలని ఈ ధర్నా ఒక ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఆదివాసి స్పెషల్ డిఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న ఉద్యమంలో భాగంగా ప్రభుత్వం స్పందించి 100శాతం రిజర్వేషన్ ప్రస్తావిని ముఖ్యమంత్రి ప్రకటించడం జరిగిందని, ఆ మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. ఐటీడీఏ ముందు మహా ధర్నా నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ సాగిన సత్యనారాయణ, ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ కన్వీనర్ ఎస్ ధర్మనపడాల్, కో కన్వీనర్లు కూడ రాధాకృష్ణ, వంతల నాగేశ్వరరావు ఉన్నారు.

ఘనంగా జెసి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటీడీఏ ఇంచార్జ్ పిఒ, జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ జన్మదిన వేడుకలను ఐటిడిఎ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం.హేమలత, డిఎంహెచ్ఒ టి.విశ్వేశ్వరనాయుడు పుష్పగుచ్ఛాలను అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియ జేసారు. అనంతరం ఆయన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ ఎడిఒ పబ్లిసిటీ పి.రాములు, ఐటిడిఎ మేనేజర్ వరంజ్యోతి, ట్రైకార్ సహాయకులు ఎస్.సీతా రామయ్య, ఐటిడిఎ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

22న జిఒ 3పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు విజయవాడ ఆదేశాల మేరకు ఈనెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు జిఒ.నెం-3, గిరిజన చట్టాలపై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహిస్తున్నామని ఐటిడిఎ ఇంచార్జ్ పిఒ. జెసి ఎంజె అభిషేక్ గౌడ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాపులో గిరిజన సంక్షేమ సంచాలకులు సదా భార్గవి అధ్యక్షతన ఐటిడిఎ కార్యాలయంలో నిర్వహించడం జరుగు తుందన్నారు. పాడేరు ఐటిడిఎ పరిధిలోని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు, ఆదివాసీ గిరిజన సంఘాలు, గిరిజన మహిళా సంఘాలు, అంతరం జాయింట్ యాక్షన్ కమిటీలు, గిరిజన పెద్దలు వివిధ సంఘాల నేతలు పాల్గొని జిఒ.నెం-3, ఏజెన్సీ చట్టాలపై అభిప్రాయాలను తెలియజేయాలని పిఒ కోరారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి -జిమాడుగుల: మండలంలో కే.కోడపల్లి పంచాయతీ బంధవీధి ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలను స్థానిక ఎస్సై షణ్ముఖరావు శనివారం సందర్శించారు ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ, ఫోక్సో చట్టంపై అవగాహన కలిగిస్తూ బాల్య వివాహాలతో అనర్థాలను వివరించారు. విద్యార్థులు ఉన్నత చదువులను చదివి ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు తమ గ్రామాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ,జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పోలీసులతో తమ సమస్యలు ధైర్యంగా చెప్పవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలం కేంద్రంలో ఉన్న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న మౌలిక వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు శనివారం కళాశాలలో సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిరసాని. కిషోర్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరిడ .మాధవరావు, చంటి లు మాట్లాడుతూ, ప్రభుత్వ మౌలిక, సౌకర్యాలు, సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు, ఈ కళాశాల స్థాపించి నేటికి సుమారుగా 25 .సంవత్సరాలు పూర్తికావస్తున్నా ఇప్పటికీ సరైన వసతి గృహాలు, ప్రహరీ, మరుగుదొడ్డి లేని దీన స్థితిలో ఉందన్నారు. ఈ కళాశాలలో సుమారుగా260 మంది విద్యార్థిని ఉన్నారని, బాలురు బాలికలకు సరైన పూర్తిస్థాయి వసతి గృహాలు ఏర్పాటు చెయ్యలేదన్నారు. విద్యార్థులు ఆరు బయట అద్దె రూముల తీసుకుని, విద్యను అభ్యసిస్తున్న పరిస్థితి, నెలకొందన్నారు. నూతనంగా ఒక భవనం మొదలుపెట్టి పిల్లర్ల వరకు నిర్మించి, పని పూర్తి కాకుండానే మధ్యలోనే పనులు నిలిపివేసారన్నారు. ఇప్పటికైనా తక్షణమే కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి హాస్టల్ భవనం పూర్తిచేయాలని వారు డిమాండ్ చేశారు

దుప్పట్లు ఇస్తున్న సర్పంచ్

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సిఎస్ఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గసభ పంచాయతీ మొర్రిగుడ గ్రామంలో దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని 100మంది గిరిజనులకు, వృద్ధులు, వితంతువులకు దుప్పట్లను సిపిఎం సర్పంచ్ పాంగి సునీత, మాజీ సర్పంచ్ సురేష్ కుమార్ అందజేశారు. సిఎస్ఎన్ చారిటబుల్ ట్రస్ట్ పౌండర్ ఎస్తేరు శ్రీను ఆర్థిక సహాయంతో పంపిణిచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ, పేద ప్రజలకు సహాయం చేయడమే నిజమైన మానవత్వమని చెప్పారు. ఈకార్యక్రమంలో ప్రతినిధులు షీమోను, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అరకు బస్ స్టేషన్‌లో సౌకర్యాలు

- తాగునీటి కుళాయిల ట్యాపుల ఏర్పాటు
- మరుగుదొడ్లు, ప్లాట్‌ఫాంలకు మరమ్మతులు
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

మరుగుదొడ్లకు చేపడుతున్న మరమ్మతులు

కుళాయిలకు బిగించిన ట్యాంపులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద సౌకర్యాలపై ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పాడేరు డివిజన్ ఆర్టిసి అధికారులు స్పందించి నూతన కుళాయి ట్యాపులను బిగించి తాగు నీరు సౌకర్యం కల్పించారు. ప్లాట్‌పాం, మరుగుదొడ్ల మరమ్మతులు ఏర్పాటు చేశారు. కొన్ని బెంచీలు ఏర్పాటు చేశారు.

కాలువల్లో పూడికతీత పనులు

పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి పంచాయతీ పరిధిలోని చిన్నగడ్డ గ్రామంలో మురుగు నీటి కాలువల్లో పేరుకు పోయిన చెత్త, పూడిక తొలగింపు పనులు శనివారం చేపట్టారు. చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత, పంచాయతీ కార్యదర్శి బోలెం లక్ష్మి కుమార్ సమక్షంలో ప్రత్యేక డ్రైవ్ రూపంలో చేపట్టారు. గ్రామంలో పేరుకుపోయిన పూడికను జేసీబీ సాయంతో శుభ్రం చేశారన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలువల్లో చెత్త వేయడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి అంబేద్కర్, పారిశుధ్య కార్మికులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎయులో కేస్ స్టడీ విశ్లేషణపై వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆంధ్ర యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ పీటర్ డెక్కర్ స్మార్ట్ సెమినార్ హాల్లో శనివారం కేస్‌స్టడీ విశ్లేషణపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి హెడ్‌ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ జాలాది రవి అధ్యక్షత వహించారు. రిసోర్స్‌పర్సన్‌గా పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ, డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఒడి ప్రొఫెసర్ రాజేష్ విశ్వనాథన్ హాజరై ప్రపంచ ఫుట్‌బాల్ పోటీ విరామ సమయంలో కోచ్ క్రీడాకారులకు ఇచ్చే మోటివేషనల్ స్పీచ్‌ను లీడర్షిప్ మోడల్స్‌కు అనుసంధానం చేస్తూ ఫెర్గుసోన్స్ ఫార్ములాను చక్కగా విశ్లేషించారు. విద్యార్థులు ఆసక్తిగా వర్క్ షాప్‌లో భాగస్వామ్యం అయ్యారు. రిసోర్స్‌పర్సన్ ప్రొఫెసర్ రాజేష్ విశ్వనాథన్‌ను హెచ్‌ఒడి ప్రొఫెసర్ జాలాది రవి, ఐసిఎస్ఎస్ఆర్ సీనియర్ రీసెర్చ్ ఫెలో ప్రొఫెసర్ ఎన్.సాంబశివరావు ప్రొఫెసర్ జి సత్యనారాయణ ప్రొగ్రామ్ అనుసంధానకర్త డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి వాహనాలు అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో విజువల్ పోలీసింగ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో అర్సెల్ మిట్టల్ నిప్పాన్ స్టీల్స్ ప్రయివేట్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా 25 అధునాతన మోటార్ సైకిళ్ళను (హోండా షైన్ 125 సిసి) అందించారు. శనివారం బీచ్ రోడ్ లోని కాళీ మాతా ఆలయం వద్ద జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఈ వాహనాలను విశాఖ నగర పోలీసులకు పంపిణీ చేశారు.

అంతర్జాతీయ పోటీలకు అంపైర్‌గా శర్మ

డివిఎస్‌వై శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: లావోస్‌లోని వియంతినే వేదికగా ఆగస్టు 6 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న వరల్డ్ టేబుల్ టెన్నిస్ యూత్ కాంటెండర్, ఆగస్టు 11 నుండి 15 వరకు అదే వేదికపై జరగనున్న వరల్డ్ టేబుల్ టెన్నిస్ ఫీడర్ 2025 పోటీలకు బ్లూబ్యాడ్జి ఎంపైర్ హోదా, విదేశీ మ్యాచ్ అఫీషియల్‌గా విశాఖపట్నానికి చెందిన డివిఎస్‌వై శర్మ హాజరుకానున్నారు. పోటీలకు భారత్ నుండి ఎంపికైన ఏకైక వ్యక్తిగా శర్మ నిలిచారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నంలోని ఎల్ఐసిలో స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు మెంబర్‌గా పనిచేస్తూ విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి, రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ : విశాఖపట్నంలో ఇంటాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటస్ ఫార్మాసిటికల్స్ లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా హిమోఫిలియా వ్యాధిగ్రస్తులకు సిబిఎం కాంపౌండ్, సంపత్ వినాయక టెంపుల్ సమీపంలోని సంస్థ కార్యాలయంలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అసోసియేట్ టి.సుజాత మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 40 ట్రాన్సిట్ హోమ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా వైజాగ్ బ్రాంచ్‌లో శనివారం హిమోఫిలియా సొసైటీతో కలిసి వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. 21 మంది రోగులకు పరీక్షలు నిర్వహించామని తెలిపారు. డాక్టర్ సి.హెచ్.విద్యావతి, డాక్టర్ జె.కె దీప్తి చంద్రిక లు కౌన్సిలర్ డిఎస్ యశస్వినీ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా శరభన్న దొర

మొట్టడం శరబన్న దొర.

ప్రజాశక్తి -జీకే వీధి: చింతపల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా మొట్టడం శరభన్నదొర నియమితులయ్యారు. రింతాడ పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా కొనసాగుతున్న తనకి తెలుగుదేశం పార్టీ గుర్తించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ లో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఇతని సేవలను గుర్తిస్తూ కూటమి ప్రభుత్వం చింతపల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా నియమించింది. తనకు ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

నర్సాపురం మెటల్ క్వారీపై చర్యలేవీ?

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని నరసాపురం గ్రామంలో అక్రమ మెటల్ క్వారీపై చర్యలు తీసుకోవాలని నరసాపురం గ్రామస్తులు ఐటిడిఎ పిఒకి ఫిర్యాదు చేసి రెండు నెలలు గడుస్తోందని, అదేవిధంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ (274/16)ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసి నెల కావస్తున్నా చర్యలు తీసుకోలేదని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మండిపడ్డారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు లేవంటే సంబంధిత అధికారులకు ఎంత వాటా అందిందో తెలియజేయాలని నిలదీశారు. బాంబులు పెట్టి కొండరాళ్లు పేల్చుతున్నారని దీంతో ఇళ్లు బీటలు వారుతున్నాయ న్నారు. సబ్‌కలెక్టర్, మైనింగ్ ఎడిని పంపించి సంయుక్త దర్యాప్తు చేయిస్తానన్న పిఒ మాటలు నెరవేరలేదని విమర్శించారు. ఇటువంటి క్వారీలు ఇంకా చాలానే ఉన్నాయని చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రకటనలో కోరారు. లేదంటే ప్రజాపోరాటం ద్వారానే తేల్చుకుంటామని ఆయన హెచ్చరించారు.

కుమారుని చేతిలో తల్లిదండ్రుల హతం

ప్రజాశక్తి - మారేడుమిల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం చావడికోట పంచాయతీ పరిధిలోని తుర్రవాడ గ్రామంలో కుటుంబాల కలహాలతో తల్లిదండ్రులను మట్టుపెట్టిన కుమారుడు పోలీసులు తెలిపిన కథనం ప్రకారం మండలంలోని చావడికోట పంచాయతీ తుర్రవాడ గ్రామంలోని అందాల సన్యాసిరెడ్డి (56), అందాల బోడమ్మ (53) భార్య, భర్తలు, కుమారుడు మల్లు రెడ్డి కొండచేను వద్ద నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి కుటుంబ కలహాలతో మద్యం మత్తులో కుమారుడు తల్లిదండ్రులు గొడ్డలితో మట్టు పెట్టినట్లు మారేడుమిల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు..

ఏషియన్ పెయింట్స్ 'సోచా బి నహీ హోగా ' విడుదల

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలోని ఇళ్లను అందంగా ఉంచడంలో ముందున్న ఏషియన్ పెయింట్స్ తాజాగా తమ కొత్త కార్పొరేట్ ఫిల్మ్ 'సోచా బీ నహీ హోగా' ను విడుదల చేసిందని సంస్థ సిఇఒ అమిత్ స్విం‌గ్లే తెలిపారు. ఒక హోటల్లో మీడియాతో మాట్లాడుతూ, ఈ పెయింటింగ్‌ను కేవలం ఒక కార్య నిర్వహణ ప్రక్రియగా కాకుండా, ప్రజల ఊహాశక్తిని మరిపించే దిశగా తీసుకు వెళుతుందని చెప్పారు. ప్రతి ఇంటిని తమ వ్యక్తిత్వం ప్రతిబింబించే విధంగా ప్రేరేపిస్తుంది అన్నారు.కొత్తగా రూపొందించిన ఈ వీడియోల ద్వారా సజనాత్మకత,డెకర్తో రంగుల వాడకాన్ని కొత్తగా అర్థం చేసుకునేలా చేస్తుందని చెప్పారు.

డిజిటల్ ట్విన్స్ శక్తిని వెలుగులోకి తెచ్చిన బెంట్లీ సిస్టమ్స్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మౌలిక సదుపాయాల ఇంజనీరిం గ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బెంట్లీ సిస్టమ్స్ డిజిటల్ ట్విన్స్ శక్తిని వెలుగులోకి తేవడం జరిగిందని, బెంట్లీ సిస్టమ్స్ ప్రాంతీయ కార్య నిర్వాహకుడు కమల కన్నన్ తిరువాడి తెలిపారు. ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలు, ఇంజనీరింగ్ సంస్థలు, మౌలిక సదుపాయాల కన్సల్టెన్సీల సీనియర్ నాయకులను ఒకచోట చేర్చడంతో పాటుగా డిజిటల్ ట్విన్స్, ఓపెన్, ఇంటిగ్రేటెడ్ డిజిటల్ డెలివరీ వంటి మౌలిక సదుపాయాలను రూపొందించి నిర్వహించే విధానాన్ని ఎలా మారుస్తున్నాయో అన్వేషించే అవకాశం కల్పించిం దన్నారు.

రోడ్లపై పశువులతో అవస్థలు

సీలేరు రామాలయం కూడలిలో పశువులు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు మార్కెట్ సెంటర్ మెయిన్‌రోడ్డు రామాలయం కూడలిలో ప్రతిరోజు పశువులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు అనేక ఇబ్బందులకు గురవు తున్నారు. సీలేరు మార్కెట్ సెంటర్‌లో ఒకపక్క ఆర్టీసీ బస్సులు, మరోపక్క ఆటోలు, కార్లు తిరుగుతుండడంతో రోడ్డు రద్దీగా ఉంటుంది. రాత్రీ, పగలు ఆవులు రోడ్లపై తిరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పశువుల యజమానులు వాటిని విడిచిపెట్టడంతో ఈ పరిస్థితి నెలకొందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు పశువుల యజమానులకు నోటీసులు ఇచ్చి హెచ్చరికలు జారీ చేసినా వాటిని బేఖాతరు చేస్తున్నారు. ఎపి జెన్కో కాలనీ, మార్కెట్‌సెంటర్, పాఠశాల ఆవరణలో పశువులు మలమూత్రాలు విసర్జిస్తున్నాయి. పంచాయతీ, ఎపి జెన్కో అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలి

రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పారిశుద్ధ్యం పరిశీలిస్తున్న పిఒ

చింతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు

రాజవొమ్మంగిలో విద్యార్థులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

పాడేరులో ర్యాలీ చేపడుతున్న జెసి, అధికారులు

సీలేరు: ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు విద్యార్థులు

చింతపల్లి : పోలీస్‌స్టేషన్ ఆవరణ శుభ్రం చేస్తున్న ఎస్ఐలు

డుంబ్రిగుడలో పిహెచ్‌సి ఆవరణ శుభ్రపరుస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకరరావు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్దిదిద్దాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని ఎపి జెన్కో ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అధికారులు, ఇంజనీర్లు విద్యుత్ ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ పాంగి దుర్గో కార్యదర్శి పరశురాం సమక్షంలో స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

చింతూరు: ఐటిడిఎ ఎర్రంపేట నుండి పోలీస్‌స్టేషన్ అంబేద్కర్ సెంటర్ ఆదివాసి అమరవీరుల కూడలి వరకూ సుమారు 400 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులతో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధానకూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఎంపిడిఒ సుండం శ్రీనివాస్‌దొర మాట్లాడుతూ ప్లాస్టిక్‌వల్ల పర్యావరణానికి పెనుప్రమాదం వాటిల్లు తోందన్నారు. జెకెసిటీ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్, ఎపిఒ జగన్నాధరావు, మండల నాయకులు ఎండి జహంగీర్, మార్కెట్ కమిటీ సభ్యులు సాలమన్ రాజు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్-ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛఆంధ్ర ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నమాణిక్యం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలి

రంపచోడవరం : ఏజెన్సీలో ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు. ఏజెన్సీలో పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందని రంపచోడవరం ఐటిడిఎ ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ పేర్కొన్నారు. అధికారులందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ కిషోర్, మెడికల్ అండ్ హెల్త్ అధికారి అన్నపూర్ణ సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా శరభవరం సచివాలయం పరిధిలో ఉన్న పాఠశాలలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ సందర్శించారు. రాజవొమ్మంగి సచివాలయం వద్ద సర్పంచ్ గొల్లపూడి రమణి అధ్యక్షతన ప్లాస్టిక్ నిర్మూలనపై పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుండి అల్లూరు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరుటౌన్: ప్లాస్టిక్ కాలుష్య నివారణ బాధ్యత అందరిపైనా ఉందని ఐటిడిఎ ఇంచార్జి పిఒ, జెసి ఎంజె అభిషేక్ గౌడ అన్నారు. శనివారం ఐటిడిఎ కార్యాలయం నుండి అంబేద్కర్ జంక్షన్ వరకు స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ని పూర్తిగా బ్యాన్ చేయాలన్నారు. వారపు సంతలు, పర్యాటక ప్రాంతాలలో వాటర్ బాటిల్ వినియోగం నివారించాలని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగంతో నీటి వనరులు కాలుష్యమవుతున్నాయని తెలిపారు. స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిషేదానికి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. అసిస్టెంట్ కలెక్టర్ కనల చిరంజీవి నాగ వెంకట్ సాహిత్ మాట్లాడూతూ, ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి హాని చేస్తుందన్నారు. ప్లాస్టిక్ భూమిలో నాలుగు వందల ఏళ్లపాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ టి.విశ్వేశ్వరనాయుడు, డిపిఒ పిఎస్ కుమార్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పాడేరు : స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర లో భాగంగా శనివారం కలెక్టరేట్లో అధికారులు ఉద్యోగులు పరిసరాలను శుభ్రం చేసారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత పరిసరరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని వ్యర్థాలను తొలగించారు. అనంతరం కలెక్టరేట్లో మొక్కలు నాటారు. కలెక్టరేట్ ఉద్యోగులతో స్వచ్ఛాంధ్రా స్వర్ణాంధ్రా ప్రతిజ్ఞ చేయించారు. ఐటిడి ఏ కార్యాలయంలో సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వేంకటేశ్వరావు, పరిపాలనాధికారి ఎం.హేమలత ఐటిడిఏ సిబ్బంది పరిసరాలను శుభ్రం చేసారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఉద్యోగులు సిబ్బంది, ఐటిడి ఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రజల సహకారం అత్యంత అవసరమని కిటుముల సర్పంచ్ గడుతూరి రమణమ్మ అన్నారు. శనివారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి జగదీష్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిటిసి సభ్యురాలు వనుము పద్మ, కార్యదర్శి జగదీష్, వైకాపా నాయకులు వనుము పోతురాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

చింతపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే ఆరోగ్యవంతమైన జీవనశైలికి పునాది అని చింతపల్లి ఎస్ఐ-1 వెంకటేశ్వరరావు, ఎస్ఐ-2 వెంకటరమణ తెలిపారు. శనివారం చింతపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో 'స్వచ్ఛ భారత్ స్వచ్ఛ్ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చునన్నారు.

దుంబ్రిగుడ: స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి రాంబాబు, ఎంపీడీవో ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య పరిసరాలలో పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు చెత్త చెదరాన్ని కూడా శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో శౌరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు : జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పాడేరులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ప్రతినెల మూడవ శనివారము స్వర్ణాంధ్ర స్వచ్ఛత ఆంధ్రాలో భాగంగా కళాశాలలో ప్లాస్టిక్ పొల్యూషన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ పి కోటేశ్వరరావు , ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి గౌరీ శంకర్. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ టి.ఎన్ రసూల్, గణేష్. దామోదర్ భాస్కర్, సుమిత్ర నిర్మల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ జానకిరామ్, అచ్యుతరావు పాల్గొన్నారు.

జిమాడుగుల మండల కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్రలో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఎంపిడిఒ డేవిడ్‌రాజ్, తహసిల్దార్ గిడ్డి రాజకుమార్ సర్పంచులు ఎంపీటీసీలు, మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జికే వీధి: మండలంలో రింతాడలో స్వర్ణాంధ్ర పంచాయతీ సెక్రెటరీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, దుకాణదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.